క్లుప్తంగా

పాత నేరస్తుల కదలికలపై నిఘా

• బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

దత్తిరాజేరు: పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ అధికారులకు సూచించారు. మండలంలోని పెదమానాపురం పోలీ స్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఎస్‌ఐ జయంతిని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో గంజాయి అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున నిత్యం వాహన తనిఖీలు చేపట్టాలని ఆదే శించారు.అసాంఘిక కార్యకలాపాలు, మద్యం అక్రమ రవాణా, నేరాల నియంత్రణకు కృషి చేయాలని చెప్పారు. డీఎస్పీ వెంట గజపతినగరం సీఐ ఏ.వి.రమణ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


గడసాం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

దత్తిరాజేరు: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. రామచంద్రాపురం, దత్తి, గడసాం, దత్తిరాజేరు, మరడాం ఉన్నత పాఠశాలలతో పాటు షికారుగంజి మోడల్ స్కూల్, కె. కొత్తవలస మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బడ్జెట్ సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 – 25 సవరణ బడ్జెట్‌లో ఆదాయం రూ.2,70,72,000 కాగా వ్యయం రూ.2,80,00,000గా చూపించారు. 2025 – 26 అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.3, 31, 21,000గా.. వ్యయం రూ.3,30,00,000గా చూపించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఎంపీడీఓ బి.కళ్యాణి, వైస్ ఎంపీపీ గెద్ద దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


కొత్తబగ్గాంలో రైతులకు సూచనలిస్తున్న గోవిందమ్మ, ధనలక్ష్మి, తదితరులు

గజపతినగరం: మొక్కజొన్న, పెసర, మినప, తదితర అపరాలు సాగు చేసిన రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ తెలిపారు. మండలంలోని పాతబగ్గాం, కొత్తబగ్గాం గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. నీటిలో మునిగిపోయిన అపరాల పంటలకు సంబంధించి ఎకరాకు 15 కిలోల యూరియా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌజన్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పిడిశీలలో వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ, సిబ్బంది

గజపతినగరం: మండలంలోని పిడిశీల గ్రామంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, వైద్య సిబ్బం ది 51 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

శనిత్రయోదశి పూజలు

బొండపల్లి: శని త్రయోదశిని పురస్కరించుకుని దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యం లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శనీశ్వరుడి విగ్రహానికి భక్తులతో తైలాభిషేకం చేయించారు.

చెత్తఫుల్... సంపద నిల్

• నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ(ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలు
• కేంద్రాల్లో తయారు కాని వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువులు
• గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి అందని వేతనాలు
• ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్న గ్రీన్ అంబాసిడర్లు
• ఎస్‌డబ్ల్యూపీసీలకు చేరని చెత్త


ఎల్.కోట మండలం రేగ పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం


కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో అరకు-విశాఖ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

లక్కవరపుకోట: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా, గ్రామ పంచాయతీలకు సంపద సృష్టిచేందుకు ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. చెత్త నుంచి సంపద సృష్టించడం మాట పక్కన పెడితే అసలు ఈ కేంద్రాలకు చెత్త చేరడం లేదు. స్వచ్ఛభారత్ మిషన్ నిధులతో 2014 నుంచి 2019 మధ్య పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.3.20 లక్షల వరకు వెచ్చించారు. కొన్ని చోట్ల ఈ కేంద్రాలను నిబంధనలకు వ్యతిరేకంగా చెరువు గర్భాల్లో, చెరువు గట్టులపై, పంట కాలువ గట్ల పై, గ్రామాలకు దూర ప్రాంతాల్లో నిర్మించారు. ఎస్.కోట నియోజకవర్గంలోని ఎల్.కోట, ఎస్.కోట, జామి, వేపాడ, కొత్తవలస మండలాల్లోని 137 పంచాయతీలు ఉండగా, 122 పంచాయతీల్లో ఎస్‌డ బ్ల్యూపీసీలను నిర్మించారు. గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసి డర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు వీధుల్లో పేరు కుపోయిన చెత్తను రిక్షాల ద్వారా ఈ కేంద్రాలకు తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేర్వేరుగా కుండీల్లో వేసి వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం, అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను స్క్రాప్ దుకాణాలకు విక్రయించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నదే ఈ కేంద్రాల ఏర్పాటు వెనుక లక్ష్యం. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడడం, గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో లక్ష్యం నీరుగారు తోంది. చాలా వరకు ఎస్‌డబ్ల్యూపీసీలు అలంకార ప్రాయంగా మిగిలాయి.

ఎస్.కోట నియోజకవర్గంలో ఎస్‌డబ్ల్యూపీసీలు, గ్రీన్ అంబాసిడర్ల సంఖ్య			
మండలం	పంచాయతీలు	ఎస్‌డబ్ల్యూపీసీలు	గ్రీన్ అంబాసిడర్లు
ఎస్.కోట	26	22	82
ఎల్.కోట	31	29	91
వేపాడ	29	25	76
కొత్తవలస	26	25	87
జామి	25	21	76


వేపాడ మండలం సింగరాయి గ్రామానికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ

అందని వేతనాలు.. పనిచేయని రిక్షాలు

ఎస్‌డబ్ల్యూపీసీలకు చెత్త తరలించే విషయంలో చాలా మంది గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటోంది. గ్రామాల్లో నిత్యం ఉదయాన్నే చెత్తా చెదా రం ఊడ్చి, వీధి కాలువల్లో పూడిక, వ్యర్థాలు, చెత్తాచెదా రాన్ని తొలగిస్తూ, ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడాల్సి వస్తోంది.ఎస్.కోట నియోజకవర్గంలో నాలుగు వందల మందికి పైగా గ్రీన్ అంబాసిడర్లు పని చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో వీరందరినీ 2018లో నెలకు రూ.6వేల వేతనానికి నియమించారు. ప్రారంభంలో వీరికి వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేసేవారు. కొన్నాళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం వీరికి వేతనాల చెల్లింపుల బాధ్యతను పంచాయతీలకు అప్పగించిం ది.నాటి నుంచి వీరికి సకాలంలో వేతనాలు అందడం లేదు. అసలే చాలీచాలని వేతనం, అది కూడా నెలల తరబడి ఇవ్వకపోవడంతో వారు విధులపై ఆసక్తి చూపడం లేదు. చెత్తను తరలించే రిక్షాలు పాడవడం, వాటి మరమ్మతులకు కూడా నిధులు ఇవ్వకపోవడంతో చెత్త తరలింపు సవ్యంగా సాగడం లేదు. పాడైన రిక్షాలతో ఊరికి దూరంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీలకు చెత్తను తరలించలేక రోడ్ల పక్కన, ఎక్కడబడితే అక్కడ పారబోసేస్తున్నారు.దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజారోగ్యం దెబ్బతింటోంది.

వినియోగంలోకి తెచ్చేలా చర్యలు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గతంలో తహసీల్దార్ల సూచనల మేరకు నిర్మించారు. కొన్ని కేంద్రాలు గ్రామాలకు సుమారు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

– కర్రి సూర్యకుమార్ ఈఓపీఆర్డీ, ఎల్.కోట మండలం.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి



ప్రజారోగ్య పరిరక్షణకు పరోక్షంగా పాటుపడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమవు తోంది.బకాయి వేతనాలను చెల్లించాలని ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట పలుమార్లు ధర్నాలు చేసి, అధికారులకు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి తక్షణమే గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు చెల్లించాలి.

– మద్దిల రమణ, పారిశుద్ధ్య కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి

ఎంపీపీ కుటుంబానికి పరామర్శ


ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నెలిమర్ల మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ మామ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తండ్రి సత్యం ఇటీవల మృతి చెందారు. మండలంలోని రామలింగాపురంలో ఆయన కుటుంబాన్ని నెలిమర్ల మాజీ ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. ఇప్పిలి సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో నెలిమర్ల జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రేగాన శ్రీను, మాజీ సర్పంచ్ సత్తిబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బెవర ఉమాకుమారి తదితరులు ఉన్నారు.

ఎస్.కోట మేజర్ పంచాయతీలో వర్గపోరు

• తొలుత కోరం లేకుండానే సమావేశం
• సభ్యుల నిలదీతతో... సమావేశాన్ని వాయిదా వేశామని ప్రకటించిన ఈఓ


మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి మౌనం పాటిస్తున్న సర్పంచ్, ఈఓ, వార్డు సభ్యులు

శృంగవరపుకోట: ప్రజల బాగోగులను పట్టించుకుని, సమస్యలను పరిష్కరించాల్సిన ఎస్.కోట మేజర్ పంచాయతీ పాలకవర్గం మూడు వర్గాలుగా చీలింది. సభ్యుల మధ్య సమన్వయం కొరవడింది. శనివారం మధ్యాహ్నం 3గంటలకు పంచాయతీ సమావేశం ఉంటుందని పంచాయతీ ఈఓ అనురాధ సభ్యులకు ముందుగానే సమాచారం ఇచ్చారు. అయితే పంచాయతీలో 20 మంది వార్డు సభ్యులు ఉండగా సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కేవలం ఐదుగురే హాజర య్యారు. సమావేశంలో ముందుగా భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.హాజరైన సభ్యు లు పట్టణంలో కొన్నిచోట్ల పారిశుద్ధ్య సమస్య ఉందని, తాగునీటి కుళాయిలు, వీధిలైట్లు వేయాలని కోరారు.అనంతరం ఎనిమిది అంశాలతో కూడిన అజెండాపై చర్చ పూర్తయ్యిందనిపించి, రిజిస్టర్‌లో సంతకాలు చేయించారు.

ఈఓను నిలదీత

సమావేశానికి హాజరుకాని వార్డుసభ్యులు సాయంత్రం పంచాయతీ కార్యాలయానికి వచ్చి కోరం లేకుండా నిర్వహించిన సమా వేశాన్ని ఎలా ఆమోదిస్తారంటూ ఈఓ అనురాధను నిలదీశారు. సంతకాలు చేసిన రిజిస్టర్ చూపాలని పట్టుబట్టారు. సభ్యుల పూర్తి మద్దతుతో కావాల్సిన సమావేశాన్ని అవ్వకుండా అయినట్టు చెప్పడంలో ఆంతర్యం ఏమిటని, ఈఓకు అంత ప్రత్యేక శ్రద్ధ ఎందుకంటూ కొందరు సభ్యులు నిలదీశారు. దీంతో ఈఓ అనురాధ సర్పంచ్‌తో ఫోన్‌లో సంభాషించి సమావేశం వాయిదా వేశామంటూ సభ్యుల ఎదుట ప్రకటించారు.

గ్రామసభల నిర్వహణపై నిర్లక్ష్యం ఎందుకు..?


మాట్లాడుతున్న ఓటరు అక్షరాస్యత వేదిక సభ్యులు

శృంగవరపుకోట: గ్రామాభివృద్ధికి రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సిన గ్రామసభలపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తు న్నారని ఓటరు అక్షరాస్యత వేదిక సభ్యులు ప్రశ్నించారు. పట్టణంలో ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు డి.సూర్యారావు వేదిక సభ్యులు ఎల్.సాంబమూర్తి, సీహెచ్.రామకృష్ణ, వి.ముత్యాలుతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా నిర్వహించాల్సిన గ్రామసభలు రాజకీయాల నీడన, అధికారుల ఇష్టానుగుణంగా జరగడం జిల్లా అధికార యంత్రాంగానికి సిగ్గుచేటు అన్నారు. దేశాభివృద్ధి, రాజ్యాంగబద్ధ పాలనలో పార్లమెంట్ ఎంత కీలకమో, గ్రామపంచాయతీల్లో గ్రామసభలు అంతే కీలకమన్నారు. ఈ ఏడాది 4వ విడత నిర్వహించాల్సి న గ్రామసభల షెడ్యూల్ ఇంత వరకూ ప్రకటించకపో వడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామసభలను చిత్తశుద్ధి లేకుండా, గ్రామస్తులకు చెప్పకుండా, తగిన ప్రచారం లేకుండా మొక్కు బడిగానే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రామసభలకు వారం రోజులు ముందుగా మీడియా ద్వారా షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉన్నా ఎక్కడా అధికారులు నియమావళిని అనుసరించడం లేదని, గ్రామసభల్లో వచ్చిన అర్జీలు, సమస్యలను పట్టించుకోకుండా అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామసభల నిర్వహణలో కీలక పాత్ర పోషించాల్సిన డీఎల్‌పీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికై నా గ్రామసభల నిర్వహణలో చిత్తశుద్ధి చూపాలని కోరారు.

జనవరి 5న టాలెంట్ టెస్ట్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో పదోతరగతి విద్యార్థులకు జన వరి 5వ తేదీన టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. టాలెంట్ టెస్ట్ ప్రచార వాల్ పోస్టర్లను కళాశాలలో అధ్యాపకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో పదో తరగతి గణితం, భౌతిక, రసాయన శాస్త్ర సబ్జెక్టులపై ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నామని చెప్పారు.వివరాలకు 81219 87431,83176 86432 నంబర్లను సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపని సదస్సులు ఎందుకు..?

చీపురుపల్లి: భూ సమస్యలకు పరిష్కారం లభించనప్పుడు, గతంలో ఇచ్చిన అర్జీలకు ఎలాంటి స్పందన లేనప్పుడు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఎవరికి ప్రయోజనమో చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. రామలింగాపురంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రాజారావు మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్యలు ఉన్నా రైతులు అర్జీలు అందిస్తే ఆర్‌టీజీఎస్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో నీలకంఠం మాట్లాడుతూ తమ గ్రామంలో భూ సర్వే జరిగిందని, అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదయ్యిందని, బ్యాంకుల్లో రుణాలు రావడం లేదని చెప్పారు. ఇదే విషయమై రెండు నెలల క్రితమే అర్జీలు కూడా ఇచ్చామని, ఇంతవరకు దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. తమ గ్రామ సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, ఇప్పిలి సురేష్, మాధవ, ఆర్‌ఐ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే..

బొండపల్లి: కొండకిండాం,రాచకిండాం గ్రామాల్లో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించా రు. అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.రాచకిండాం,కొండకిండాం గ్రామాల సర్పంచ్‌లు బొక్కాకు ఈశ్వరమ్మ, పెద్దమజ్జి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

• విద్యారంగ సమస్యలపై పోరాటం



విద్యారంగ సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అలుపెరగని పోరాటం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్య దర్శి ఆర్.శిరీష తెలిపారు. గజపతినగ రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేసిన అనంతరం శిరీష మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల్లో విడుదల చేస్తామన్న ఉపకార వేతనాలు నేటికీ అందించలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యి లను విడుదల చేయలేదని ఆరోపించారు.గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ వసతి గృహాలకు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.సోమేష్, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

– గజపతినగరం

• మేలుకొలుపు



ఎల్.కోట మండలంలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెల్లిగౌరమ్మపేట గ్రామంలో యువకులు, చిన్నారులు శనివారం వేకువ జామున మేలుకొలుపు, నగర సంకీర్తన నిర్వహించారు. ముందుగా రామాలయంలో పూజలు చేశారు. అనంత రం సీతారాముల చిత్రపటాన్ని పట్టుకుని భక్తి గీతాలు పాడుతూ, భజన చేస్తూ గ్రామంలోని వీధుల్లో తిరిగారు. భోగి పండగ వరకు రోజూ మేలుకొలుపులు నిర్వహిస్తామని భజన మండలి సభ్యులు తెలిపారు.

– లక్కవరపుకోట

• గణిత శాస్త్ర ప్రాజెక్టుల ప్రదర్శన



గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో నిర్వహించిన గణిత వారో త్సవాలు శనివారంతో ముగిశాయి. విద్యార్థుల పలు మ్యాథ్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వ హించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. పాఠశాల ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

–శృంగవరపుకోట

పాఠశాల సందర్శన


విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న జిల్లా అకడమిక్ మానటరింగ్ కమిటీ సభ్యులు

వేపాడ: మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను జిల్లా అకడమిక్ మానటరింగ్ కమిటీ సభ్యులు ఎం.రామకృష్ణ, వి.భారతి శనివారం సందర్శించారు. తరగతి గదులు, రికార్డులు, మరుగుదొడ్లు, పెరటితోటలో కూరగాయల పెంపకం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన వంటల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. వారి వెంట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వి.భాస్కరరావు, సీఆర్‌పీ కోటేశ్వరరావు ఉన్నారు.

రాజ్యాంగ సదస్సు రేపు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బహుజన కళామండలి సభ్యులు

వేపాడ: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ – భారత రాజ్యాంగం అనే అంశంపై ఈనెల 30వ తేదీన చీపురుపల్లిలో నిర్వహించనున్న సదస్సుకు అంబేడ్కర్ వాదులు, యువత హాజరై విజయవంతం చేయాలని బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతవ ఉదయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ సదస్సుకు సంబంధించిన కరపత్రికలను ఆతవలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి గొప్పదన్నారు. సదస్సుకు ప్రజాకవి జయరాజు హాజరవుతారని చెప్పారు. బహుజన చైతన్యం కోసం పనిచేసిన అంబేడ్కర్, గద్దర్ జాతీయ అవార్డుల గ్రహీత గంటాన అప్పారావుతో పాటు పలువురికి సన్మానం చేయనున్న ట్లు పేర్కొన్నారు.బహుజన కళామండలి సభ్యులు జైబీమ్ ప్రకాష్, ఆతవ నాగరాజు, దప్పు రాజు, టి.గౌండయ్య, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేసే వరకు పోరాటం


కార్మిక సంఘ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యవాణి, డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: కార్మికులకు చేస్తామన్న వేతన ఒప్పందాన్ని వెంకట్రామా పొల్రీస్ యాజమాన్యం అమలు చేసే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు టి.వి. రమణ,జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరునాయుడు చెప్పారు. కర్లాంలోని వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా పరిశ్రమ ప్రధానగేటు వద్ద శనివారం వంటా వార్పు నిర్వహించారు.ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ 2024 జూన్‌లో వేతన ఒప్పందం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ వేతన ఒప్పందం అమలు జరగలేదన్నారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు కార్మికశాఖ డీసీఎల్, జేసీఎల్ సమక్షంలో పలుమార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయన్నారు. మూడు నెలల క్రితమే యాజమాన్యానికి కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారని, అందులో భాగంగానే 27 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారన్నారు. ప్రశాంతంగా సమ్మె చేస్తున్న కార్మికులపైకి పోలీసు బలగాలను దింపి భయాందోళనలకు గురి చేయడం సరికాదన్నారు.

చర్చలు విఫలం....

ఇది ఇలా ఉండగా కార్మిక సంఘం, పరిశ్రమ యాజమాన్యం మధ్య శనివారం చర్చలు జరిగాయి. కార్మిక సంఘ నాయకులు కనీసం రూ.2 వేలు వేతన పెంచాలని పట్టుబట్టగా.. పరిశ్రమ జీఎం పరుచూరి హరికృష్ణ, డీజీఎం నాగలక్ష్మి రూ.300 మాత్రమే చేయగలమని స్పష్టం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య చర్చలు విఫలమయ్యా యి. దీంతో కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు.

రంగంలోకి దిగిన ఆర్డీఓ, డీఎస్పీ

శనివారం సాయంత్రం ఆర్డీఓ జి.సత్యవాణి, డీఎస్పీ రాఘవులు కర్లాంలోని పరిశ్రమ వద్ద సమ్మె చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లారు. కార్మికులతో డీఎస్పీ మాట్లాడుతూ సమ్మె చేసుకునే హక్కు ఉన్నప్పటికీ పరిశ్రమ కార్యకలాపాలను అడ్డుకోకూడదని, ఎలాంటి ఇబ్బంది కలిగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోసారి యాజమాన్యంతో చర్చ లు జరపాలని ఆర్డీఓ సూచించడంతో జనవరి 2న చర్చలు జరిపేందుకు నిర్ణయించారు.